క్లుప్తంగా

భాగవతంతో ఆధ్యాత్మిక జ్ఞానం



ప్రవచనాలు బోధిస్తున్న విశ్వ శర్మ

దుబ్బాకటౌన్: శ్రీమద్దేవీ భాగవతం వినడం ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానం, స్త్రీ శక్తి ప్రాముఖ్యం తెలుసుకోవచ్చని ప్రవచన కర్త విశ్వ శర్మ అన్నారు. శ్రీమద్దేవి భాగవత ప్రవచన మహోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. 5వ తేదీ వరకు దుబ్బాక ఆర్యవైశ్య సంఘంలో లలితా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన తొలిరోజు భాగవత పురాణ అంశాలను, అమ్మవారి రూపాల గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో లలితా సేవా సమితి సభ్యులు కళావతి, పద్మ, స్వరూప, రాణి, పురోహితులు వేలేటి జయరామశర్మ, దుబ్బాక వాసవి క్లబ్ ప్రతినిధులు చింత రాజు, నాగేందర్, శ్రీనివాస్, సుభాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు



క్రీడా సామగ్రి అందిస్తున్న మల్లేశం

దుబ్బాకటౌన్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి చదువుతోపాటు క్రీడలు ఎంతో దోహదపడతాయని లయన్స్ క్లబ్ స్నేహ గజ్వేల్ అధ్యక్షుడు మల్లేశం అన్నారు. రాయపోల్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండడానికి, ఆరోగ్య పరిరక్షణకు ప్రతిరోజు వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం నాగరాజు, క్లబ్ ఉపాధ్యక్షుడు డా.కుమారస్వామి, నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, క్రీడాకారులు నరేశ్, శ్రీకాంత్, పరశురాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎకరాకు ఒక బస్తానే..



యూరియాను పరిశీలిస్తున్న ఏఓ సంతోష్

బెజ్జంకి(సిద్దిపేట): యూరియాను ఎకరాకు ఒక బస్తా చొప్పున మాత్రమే రైతులకు విక్రయించాలని ఏఓ సంతోష్ దుకాణదారులకు సూచించారు. బెజ్జంకిలోని ఎరువుల దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. యూరియా నిలువలను పరిశీలించారు. నిర్వాహకులతో మాట్లాడుతూ భూమి విస్తీర్ణం బట్టి ఈ దఫాలో యూరియాను ఒక్కొక్క బస్తా చొప్పున ఇవ్వాలని సూచించారు. ప్రతి బస్తాను ఈపాస్ మిషన్ ద్వారనే విక్రయించాలని చెప్పారు. మోతాదుకు మించి యూరియా వాడకం వల్ల పంటలు చీడపీడల బారిన పడతాయని హెచ్చరించారు.

సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న రవి, మల్లేశం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు, కాశగుడిసెలు గ్రామాలకు చెందిన పలువురికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశం అందజేశారు. ఆకునూరుకి చెందిన తాటికొండ రాములకు రూ.25 వేలు, ఎండీ.పర్వీన్‌కు రూ.25 వేలు, కాశగుడిసెల గ్రామానికి చెందిన షేక్ అజ్రత్‌కు రూ.15 వేల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నానిబాబు, రాజుగౌడ్, షరీఫ్, బాలరాజు, మాధవరెడ్డి, హైమద్, కనుకయ్య, వెంకట్‌రెడ్డి, రఘువీర్, శ్రీకాంత్, రాజశేఖర్, అజ్జు, కమల్, ఖలీం, ఎక్రమొద్దీన్, సత్యం, నసీర్, సలీం, శ్రీను, నరేశ్, వేణు, మల్లేశం, శివ, లింగం తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

మర్కూక్(గజ్వేల్): విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ వెంకటరాములు అన్నారు. మండలంలోని అంగడికిష్టాపూర్ పాఠశాల విద్యార్థులకు స్పందన చారిటబుల్ ట్రస్ట్, దాత మేకల కనకయ్య సహకారంతో నోటు పుస్తకాలు, ఫ్రీ ప్రైమరీ విద్యార్థులకు మాధ్యమ సెమిస్టర్ పుస్తకాలను గురువారం అందించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి స్పందన చారిటబుల్ ట్రస్ట్, దాతలు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. హెచ్ఎం బాలకిషన్, మాజీ సర్పంచ్ రాములుగౌడ్, ఉపాధ్యాయులు హారిక, చిన్నికృష్ణ, సంతోషిమాత, ఎస్ఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, సీఆర్పీ అంజలి పాల్గొన్నారు.

శునకాల స్వైరవిహారం

గ్రామాల్లో వీధి కుక్కల బెడద అధికమైంది. కుక్కలు గుంపులు, గుంపులుగా స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్నా, పెద్ద అని తేడా లేకుండా దాడి చేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో రోడ్లమీద ప్రయాణించాలంటేనే ప్రజలు భయా బ్రాంతులకు గురువుతున్నారు.

రోడ్ల మీదకు రావాలంటేనే భయం
- చిన్నారులను గాయపరుస్తున్న కుక్కలు
- గొర్రెలు, మేకలపై దాడులు
- చోద్యం చూస్తున్న అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లి, కట్కూర్, మల్లంపల్లి, జనగామ, ధర్మారం, కపూర్‌నాయక్‌తండా, పంతుల్‌తండా, మంచినీళ్ల బండ, కేశవాపూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో కుక్కల సంతతి పెరిగింది.

వెంటాడి.. గాయపర్చి

గౌరవెల్లి గ్రామంలో వారం, పది రోజుల వ్యవధిలో మూడు గొర్రెలు, రెండు మేకలతో పాటు 14 బర్రె దూడలపై కుక్కలు దాడిచేసి చంపేశాయి. అదేవిధంగా ఓ చిన్నారిని గాయపరిచినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువ కావడంతో ప్రజలు రోడ్ల వెంట ప్రయాణించేందుకు నానా కష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి కుక్కల బెడద నివారణకు కు.ని ఆపరేషన్లకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గౌరవెల్లిలో రోడ్లపై తిరుగుతున్న కుక్కలు



కుక్కల దాడిలో మృతి చెందిన దూడ

వీధికుక్కల గణన చేపట్టారా?

గ్రామాల్లో వీధికుక్కలు ఎన్ని ఉన్నాయి. వాటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి. టీకా ఇవ్వడంతోపాటు, చికిత్సకు ఎంత వ్యయం అవుతుందన్న వివరాలు మొదట సేకరించాలని ప్రభుత్వం ఆదేశించినా ఎక్కడా అది కానరావడం లేదు. అక్కన్నపేట మండలంలో 37 గ్రామాలు ఉండగా అందులో సుమారుగా 852 వరకు వీధి కుక్కలు ఉన్నట్లు అంచనా. గ్రామాల్లో రాత్రి, పగలు అనే తేడా లేకుండా గుంపులుగా సంచరిస్తున్నాయి.

కుక్కలను చూస్తేనే భయమేస్తోంది



గ్రామంలో సుమారు 50కి పైగా కుక్కలు వీధుల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. పెంచుకుంటున్న మేకలు, గొర్రెలపై దాడులు చేసి చంపేస్తున్నాయి. సుమారుగా ఐదారు మేకలు, గొర్రెలపై దాడిచేసి బలితీసుకున్నాయి. రోడ్ల వెంట ప్రయాణించాలన్నా.. నడవాలన్నా గుండెలు అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కుక్కలను నియంత్రించాలని పలుమార్లు సంబంధింత అధికారులు, పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదు.

– గొల్లపెల్లి వీరాచారి, గౌరవెల్లి

చిన్నారులు, వృద్ధులు ఏమాత్రం బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యం

పోలీసు కమిషనర్ అనురాధ

చేర్యాల(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్): పోలీసులు విధి నిర్వహణతోపాటు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని, సమయం దొరికినప్పుడల్లా వాకింగ్, రన్నింగ్ యోగా చేయాలని పోలీసు కమిషనర్ అనురాధ సూచించారు. చేర్యాల స్టేషన్‌ను గురువారం ఆమె సందర్శించారు. హుస్నాబాద్ ఏసీపీ సదానందంగౌడ్, చేర్యాల సీఐ ఎల్.శ్రీను ఆమెకు స్వాగతం పలికారు. స్టేషన్ పరిసర ప్రాంతాలు, సీజ్ చేసిన వాహనాలు, రికార్డులు పరిశీలించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. సీజ్ చేసిన వాహనాలను యజమానులకు అప్పగించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోకార్ విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నీరేష్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, కోర్టు మానిటర్ ఎస్ఐ రాజేశ్, ఏఎస్ఐ సదాశివరావు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, నరేందర్, నాగిరెడ్డి, జనార్దన్, సీసీ నితిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమె మద్దూరు స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ ఆవరణంలో మొక్కలు నాటారు. ఆమె వెంట ఏసీపీ సదానందం, చేర్యాల సీఐ శ్రీను, ఎస్ఐ షేక్ మహబూబ్ తదితరులు ఉన్నారు.



చేర్యాల స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న పోలీసు కమిషనర్ అనురాధ

సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమలకు తోడ్పాటు



సదస్సుకు హాజరైన మహిళలు

అదనపు డీఆర్‌డీఓ సుధీర్

అక్కన్నపేట(హుస్నాబాద్): కేంద్ర ప్రభుత్వం సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణకు తోడ్పాటు అందిస్తుందని అదనపు డీఆర్‌డీఓ సుధీర్, రవీకుమార్ తెలిపారు. స్థానిక రైతువేదికలో గురువారం ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల క్రమబద్ధీకరణ పథకం(పీఎంఎఫ్ఎంఈ)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఈ పథకాన్ని తీసుకొవచ్చారన్నారు. ఈ పథకం కింద రూ.లక్ష నుంచి రూ.30లక్షల వరకు రుణం తీసుకోవచ్చని చెప్పారు. ఐకేపీ సిబ్బందిని సంప్రదిస్తే దరఖాస్తులు చేయిస్తారన్నారు. ప్రస్తుతం తొమ్మిది మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి ఓఎస్‌డీ మల్లేశం, ఏపీఎం శ్రీనివాస్, డీఆర్‌పీ వంశీ, సీసీలు శివ చరణ్‌సింగ్, తిరుపతి, రాజు, శ్రీలత, మండల సమాఖ్య అధ్యక్షురాలు అశ్విని, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

'మా భూముల జోలికి వస్తే చచ్చిపోతాం'

అక్కన్నపేట(హుస్నాబాద్): తమ తాత ముత్తాతల నుంచి సాగు చేసుకుంటూ జీవిస్తున్న భూముల జోలికి వస్తే చచ్చిపోతామని చౌటకుంటతండా వాపోయారు. అటవీశాఖ అధికారులు తమ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, విచారణ జరిపి పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్ అనంతరెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ మాలోతు నర్సింహానాయక్ మాట్లాడుతూ సర్వే నంబరు 97లో చౌటకుంటతండా పరిధిలోని భూముల్లో ఎంతో మంది పేద గిరిజన రైతులు సాగు చేస్తూ కుటుంబాలను పోషిస్తున్నారన్నారు. ఎన్నోయేళ్లుగా సాగు చేస్తున్న తమ భూములను అటవీ అధికారులు స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని వాపోయారు. రెవెన్యూ అధికారులు విచారణ జరిపి తమ భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తిరుపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మార్వో అనంతరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోహెడరూరల్(హుస్నాబాద్): ఎలాంటి అనుమతి లేకుండా మండలంలోని పోరెడ్డిపల్లి శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. పోరెడ్డిపల్లి నుంచి హుస్నాబాద్, అక్కన్నపేట మండలానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో దాడిచేశామని చెప్పారు. వాటిని తహసీల్దార్ అహ్మద్‌కు అప్పగించారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా మహేశ్



మహేశ్

దుబ్బాకరూరల్: మండలంలోని పెద్దగుండవెల్లి రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎల్పుల మహేశ్‌ను ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా మల్లుగారి ప్రభాకర్, కోశాధికారిగా యాదగిరి, కార్యదర్శిగా నిమ్మ సంజీవరెడ్డి, శాశ్వత కార్యదర్శిగా దుర్గారెడ్డి, మెంబర్లు ప్రవీణ్‌కుమార్, నర్సారెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులను ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని మహేశ్ అన్నారు.

నాచగిరి హుండీ ఆదాయం రూ.26.26 లక్షలు



లెక్కింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి శ్రీలక్ష్మీనృసింహక్షేత్రంలో గురువారం హుండీ కానుకలు లెక్కించారు. గడచిన 100 రోజులలో భక్తులు వేసిన కానుకల ద్వారా ఆలయానికి రూ. 26,26,343 ఆదాయం లభించిందని ఈఓ విజయరామారావు తెలిపారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో హుండీలను తెరిచారు. హైదరాబాద్ భ్రమరాంబిక సేవాసమితి, శివశక్తి సేవాసమితి సభ్యులు, ఆలయసిబ్బంది సుధాకర్, పాండు, నరేందర్, నర్సింహులు లెక్కింపులో భాగస్వాములయ్యారు.

బస్సు పునరుద్ధరణపై విద్యార్థుల హర్షం

కొండపాక(గజ్వేల్): తమ కళాశాల వరకు ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. సిద్దిపేట నుంచి ఖమ్మంపల్లి, మర్పడ్గ, సిర్సనగండ్ల, దమ్మక్కపల్లి రవీంద్రనగర్ గ్రామాల మీదుగా కొండపాక శివారులోని రాజీవ్ రహదారి ప్రక్కన ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ఆర్టీసీ అధికారులు గురువారం బస్సు సర్వీసును తిరిగి ప్రారంభించారు. కొండపాక శివారులో ప్రభుత్వం జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ ఏర్పాటు చేసినప్పటికీ బస్సు సౌకర్యం లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మొదట్లో బస్సు తిరిగినా వివిధ కారణాల వల్ల సుమారు యేడాదిగా నిలిపివేశారు. దీంతో విద్యార్థులు వినతిపత్రాలు ఇవ్వడం, పలుమార్లు సాక్షి దినపత్రికలో కథనాలు ప్రచురితం కావడంతో ఎట్టకేలకు ఆర్టీసీ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ రఘు, ఇతర అధికారులకు విద్యార్థులు, కళాశాల సిబ్బంది, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

స్టైఫండ్ కోసం వైద్య విద్యార్థుల ఆందోళన

సిద్దిపేటఅర్బన్: తమకు వెంటనే స్టైఫండ్ ఇవ్వాలని కోరుతూ మిట్టపల్లిలోని సురభి వైద్య కళాశాలలోని పీజీ వైద్య విద్యార్థులు గురువారం ఉదయం నిరసన వ్యక్తం చేశారు. కోర్సులో భాగంగా కళాశాల అనుబంధ ఆస్పత్రిలో అందించే సేవలకు గాను వైద్య విద్యార్థులకు స్టైఫండ్ ఇవ్వాలనేది ప్రభుత్వ నిబంధన. అయితే కొన్ని రోజులుగా వైద్య విద్యార్థులు ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నా వారికి స్టైఫండ్ ఇవ్వకపోవడంతో ఆందోళనకు దిగారు. కళాశాల డీన్, డైరెక్టర్లు విద్యార్థులతో గురువారం చర్చించారు. స్టైఫండ్ విషయాన్ని కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు హామీ ఇచ్చినట్లు కళాశాల ప్రతినిధులు చెప్పారు.

అర్హులకే ఇళ్లు మంజూరు చేయాలి

బీజేపీ నేతల వినతి

మిరుదొడ్డి(దుబ్బాక)/కోహెద(హుస్నాబాద్): అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. మిరుదొడ్డి, కోహెడ ఎంపీడీఓ కార్యాలయాల వద్ద మండల అధ్యక్షులు జిగిరి అమర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఖమ్మం వెంకటేశం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్లను అనర్హులకు మంజూరు చేయించారని ఆరోపించారు. అర్హులకు మంజూరు చేయక పోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. శ్రీనివాస్, దేవరాజు, రోశయ్య, రాములు, నర్సింహులు, స్వామి, జాలిగం రమేశ్, నర్సయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి పథకాలు

సీఆర్పీ జయలక్ష్మి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను మహిళ సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సీఆర్పీ జయలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రామ సంఘం పధాదికారుల శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తిలో భాగంగా మహిళా సంఘాలకు క్యాంటీన్లు, మహిళా శక్తి బజార్లు, యూనిఫాంలు, పెట్రోల్ బంకులు లాంటివి అప్పగిస్తారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కిరణ్, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఆర్పీ జయలక్ష్మి

సంక్షిప్త వార్తలు

◆ **ఓపెన్ విద్య కోసం దరఖాస్తుల ఆహ్వానం**

కొండపాక(గజ్వేల్): ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యభ్యాసాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని దుద్దెడ హెచ్ఎం లక్ష్మి గురువారం తెలిపారు. మీసేవా కేంద్రాల్లో ఫీజు చెల్లించిన పత్రాన్ని హైస్కూల్లో అందజేయాలని చెప్పారు.

కుక్ పోస్టుకు..

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలల్లో కుక్ పోస్ట్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ వరదరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 94939 72765 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

◆ **ఆలయ భూములను కాపాడండి**

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ఐఓసీ పక్కన ఉన్న దేవాలయ భూములను కాపాడాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ శ్రావణ్‌కు గురువారం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సంగాపూర్ మార్గంలో ఉన్న శివాలయానికి చెందిన భూమిలో కొంతమేర గత ప్రభుత్వం ఐఓసీ కార్యాలయాన్ని నిర్మించారన్నారు. కోట్ల విలువ ఆలయ భూములు ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నాయని, వాటిని కాపాడేందుకు అధికారులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. మనోహర్ యాదవ్, మధుసూదన్, శశిధర్‌రెడ్డి, శివకుమార్, జనార్దన్, వెంకట్‌రెడ్డి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

◆ **దూరవిద్యలో ప్రవేశాలు**

దౌల్తాబాద్(దుబ్బాక): మధ్యలో బడి మానేసి, 15 యేళ్లు నిండిన వయోజనులు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఎంఈఓ కనకరాజు తెలిపారు. మరిన్ని వివరాలకు దొమ్మాట పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

◆ **విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేత**

కొండపాక(గజ్వేల్): మండలంలోని లకుడారం హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అనంతరామారావు సొంత ఖర్చులతో విద్యార్థులకు గురువారం నోట్‌బుక్స్ అందజేశారు. ఆయనను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

◆ **ఆకర్షితులయ్యేలా బోధన**

కొండపాక(గజ్వేల్): విద్యార్థులు ప్రభుత్వ బడులకు ఆకర్షితులయ్యేలా బోధన ఉండాలని ఎంఈఓ సత్తయ్య సూచించారు. మండలంలోని రాయవరం పాఠశాలలో గురువారం బాలవాటిక ఫ్రీ ప్రైమరీ విద్యాబోధన తరగతులతో పాటు ఓ దాత అందజేసిన వాటర్ ఫిల్టర్‌ను సదుపాయాన్ని ఆయన ప్రారంభించారు. హెచ్ఎం మంజుల, సీఆర్పీ సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **కంప్యూటర్ల బహూకరణ**

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు హెచ్ అండ్ఆర్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సభ్యులు గురువారం కంప్యూటర్‌లు బహూకరించారు. ఈ సందర్భంగా వారు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇతర సాంకేతిక పరిజ్ఞానం గురించి విద్యార్థులకు వివరించారు.

◆ **అవగాహనతో టీబీ నివారణ**

నంగునూరు(సిద్దిపేట): సరైన అవగాహన ఉంటే టీబీని నివారించవచ్చని హెచ్ఈఓ స్వామి గ్రామస్తులకు సూచించారు. పాలమాకుల సబ్‌సెంటర్‌లో గురువారం టీబీ విముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉంటే వైద్య పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి సోకినట్లు గుర్తిస్తే ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందని చెప్పారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ వారోత్సవాలలో భాగంగా పోలీసు అధికారులు చేపట్టిన అవగాహన కార్యక్రమాలు గురువారం కూడా ముమ్మరంగా కొనసాగాయి. పలువురు సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, న్యాయమూర్తులు పాల్గొని గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి పలు పాఠశాలల్లోని విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని సూచించారు. తమ లక్ష్యాలపై దృష్టి సారించాలని కోరారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని వారితో ప్రతిజ్ఞ చేయించారు.



మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్టలో విద్యార్థుల మానవహారం



కోహెడలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



అక్కన్నపేట(హుస్నాబాద్): అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



సిద్దిపేటరూరల్: తోర్నాల ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్ఐ అపూర్వరెడ్డి



గజ్వేల్: ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో మాట్లాడుతున్న ఏసీపీ నర్సింహులు



బెజ్జంకి(సిద్దిపేట): ర్యాలీలో పాల్గొన్న ఎస్ఐ తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ సంగీత తదితరులు



దుబ్బాకటౌన్: రాయపోల్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ షేక్ లతీఫ్



దుబ్బాక: లచ్చపేట మోడల్ స్కూల్ విద్యార్థులతో న్యాయమూర్తి జితేందర్, ఎస్ఐ గంగరాజు